క్లుప్తంగా

ఓటర్ల జాబితా పరిశీలన 40 శాతం పూర్తి
జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో చేపట్టిన ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన 40 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలిన పూర్తి పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. ఈ నెల 21 నూరు శాతం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వై.ఆంజనేయరెడ్డి (వైఎస్సార్ సీపీ), శివరాం ప్రసాద్ (టీడీపీ) పి, ఏసుదాస్ (కాంగ్రెస్), బాలు (సీపీఐ) పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



మధురానగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవటంతో పాటు వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని గులామెహుద్దీన్‌నగర్ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆయేషా సూచించారు. అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని గులామెహుద్దీన్‌నగర్ ఆరోగ్యకేంద్రంలో బుధవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృ యోజన కార్యక్రమంలో భాగంగా హైరిస్క్ గర్భిణులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసుకోవాల్సిన టీకాల గురించి వివరించారు. అలాగే ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రసవం చేయించుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు.

అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్యస్వామి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

బీఎల్‌వోలకు సహకరించండి

పటమట(విజయవాడతూర్పు): ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో గత నెల 21 నుంచి ఈ నెల 21 వరకు ఇంటింటికీ ఓటరు సర్వే జరుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విజయవాడ నగర నగరవాసులు ఇంటింటి వచ్చిన బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో) లకు తమ కుటుంబ సభ్యుల వివరాలు అందించి సహకరించాలని కోరారు. కుటుంబంలో 18 ఏళ్లుదాటిన వారిని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పనికని ఇంటి నుంచి వెళ్లిన తన భార్య కనబడడం లేదంటూ ఓ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామకృష్ణాపురం కోడూరు వారి వీధికి చెందిన చిన్న సాయికిరణ్, హరిత దంపతులు నాలుగేళ్ల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో ఇద్దరు పనిచేస్తుంటారు. బంగారం కొనుగోలు విషయంలో భార్యాభర్తలకు మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. ఈ నెల 8వ తేదీన సాయికిరణ్‌కు సెలవు కావడంతో హరిత షాపునకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నం ఆమెకు ఫోను చేయగా ఎంతసేపటికి ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చి షాపు దగ్గరకు వెళ్లి విచారించగా హరిత పనికి రాలేదని తెలిపారు. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద ఆరాతీసిన ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను వేధిస్తున్న భర్తపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామానికి చెందిన కొత్తపల్లి సునీత 2022లో వంశీ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. ఇద్దరూ కలిసి గ్రామంలోనే కాపురం పెట్టారు. ఆ తర్వాత కొంతకాలానికి భర్త ప్రవర్తనలో మార్పు వచ్చింది. నిత్యం గొడవ పడుతూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. ఆమెను వదిలి వంశీ తన సొంత ఊరు యనమలకుదురు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి సునీత విజయవాడలో తన పిన్ని వద్ద ఉంటూ బీసెంట్ రోడ్డులోని ఓ షాపులో పనిచేస్తోంది. ఆమె అడ్రస్ తెలుసుకున్న భర్త వంశీ మంగళవారం ఆమె పనిచేస్తున్న షాపు వద్దకు వెళ్లి గొడవ చేశాడు. దీనిపై సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి కుటుంబం ఆర్థిక పరిపుష్టి సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 60వ డివిజన్ 267వ వార్డ్ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి వాంబేకాలనీ జి బ్లాకులోని 276 గడపలను ఆయన సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరు, వాటిపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాల పథకాల ద్వారా తామంతా ఆనందంగా ఉన్నామని స్థానిక ప్రజలు తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న డ్రెయిన్లు, పారిశుద్ధ్య, తాగునీరు సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించిన ఆయన నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో యాంటీ లార్వా డ్రైవ్....

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ నివాసాలకు వచ్చిన ఎమ్మెల్యేకు దోమల సమస్యపై స్థానికులు అధికంగా ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయన సంబంధిత కార్పొరేషన్ మలేరియా విభాగం ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ పరిసర ప్రాంతాల్లో యాంటీ లార్వా డ్రైవ్‌ను నిర్వహించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది డ్రోన్ సాయంతో వెక్టో బ్యాక్ట్ పౌడర్‌ను చల్లించారు. లార్వా దశలోనే దోమల వ్యాప్తిని నియంత్రించడంపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మనుషులు చేరలేని హైరిస్క్ ప్రాంతాల్లో ఇలానే డ్రోన్ల సాయంతో మందును పిచికారీ చేయించాలని తెలిపారు. కాలువలు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించడంతో పాటు పగలు, రాత్రి రెండు పూటలా ఫాగింగ్ నిర్వహించాలన్నారు.



డ్రోన్ సాయంతో చేస్తున్న లార్వా డ్రైవ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, అధికారులు

ఎన్టీఆర్‌కు ద్రోహం చేసిన 420 ఎవరో లోకేష్ చెప్పాలి...

అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ప్రజలను మోసగించడంలో చంద్రబాబు, లోకేష్‌లను మించిన 420లు దేశంలోనే లేరని విమర్శించారు. ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి, పార్టీ గుర్తును కాజేసిన 420 ఎవరో నారా లోకేష్ సమాధానం చెప్పాలని తెలిపారు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మేనిఫెస్టోను మాయం చేసిన 840 మీరు కాదా అని నిలదీశారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఢీకొనే సత్తా లేకే టీడీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం, రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడం చేస్తున్నారని మండిపడ్డారు. హుదూద్, తిత్లీ తుఫాన్ల సమయంలో వరద బాధితులకు కనీసం నిత్యవసరాలు కూడా అందించలేని అసమర్థుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. నాడు కేంద్రం ఇచ్చిన రూ.1000 కోట్ల నిధుల్లో కేవలం రూ.300 కోట్లను మాత్రమే ఖర్చుచేసి మిగిలిన నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, బయాలజిస్ట్ సూర్యనాయక్, సీడీఓ జగదీశ్వరీ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని బాధ్యతగా స్వీకరించాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మొక్కలు, చెట్ల మీదనే సమస్త జీవుల మనుగడ ఆధారపడి ఉందని, మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని ప్లానింగ్ బోర్డు వైఎస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలో మొక్కల నాటే కార్యక్రమం బుధవారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన పలు చోట్ల మొక్కలను నాటారు. మన ఇంటి పరిసరాల్లో పచ్చదనాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న కాలుష్య కోరల్లో నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు ప్రతి ఇంటికి కనీసం ఒక్క మొక్క అయినా తప్పకుండా పెంచాలని సూచించారు. పార్కుల విభాగం సూపర్‌వైజర్ విక్టర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

భారతీయ సంస్కృతికి ప్రతీక చేనేత వస్త్రాలు

పటమట(విజయవాడతూర్పు): విశిష్టమైన భారతీయ సంస్కృతికి చేనేత వస్త్రాలు ప్రతీకలుగా నిలుస్తాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) డైరెక్టర్ ఎం.జానకి అన్నారు. పటమట పంటకాల్వ రోడ్డులోని స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న చేనేత జౌళి శాఖ, ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ అపురూపమైన నైపుణ్యత, సృజనాత్మకతతో చేనేత కార్మికులు అహర్నిశలు కష్టపడి ఇంద్రధనస్సు వంటి చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నారని చెప్పారు. వాటిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. చేనేత జౌళి శాఖ, ఆప్కో ఈ తరహా ప్రదర్శనలు ఏర్పాటు చేయటం నేత కార్మికులకు ఎంతో ఉపయోగకరమన్నారు. తరతరాల భారతీయ సంస్కృతి, వారసత్వానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా చేనేత సోయగాలు నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజైనా నేత దుస్తులను ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్కో జీఎం తనూజారాణి తదితరులు పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలు తిలకిస్తున్న సీవీసీ డైరెక్టర్ జానకి

భక్తుల సూచనలు స్వీకరించాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారికి తలనీలాలు సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని, వారికి ఏమైనా సమస్యలు ఎదురైనా వాటిని ఫిర్యాదులు, సూచనల రూపంలో స్వీకరించాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అధికారులను ఆదేశించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కేశ ఖండనశాలను బుధవారం చైర్మన్ కర్నాటి రాంబాబు పరిశీలించారు. తలనీలాలు సమర్పించేందుకు విచ్చేసే భక్తుల పట్ల గౌరవంగా మాట్లాడాలని, సిబ్బంది ప్రవర్తన అమ్మవారి ఆలయానికి మంచి పేరు తీసుకువచ్చేలా ఉండాలని చైర్మన్ రాంబాబు పేర్కొన్నారు. భక్తుల తమ అభిప్రాయాలతో పాటు ఫిర్యాదులు, సూచనలు చేసేందుకు పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలని, ఆ పుస్తకంలో నమోదయిన ప్రతి అంశాన్ని ఆలయ ఈవో, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేశ ఖండనశాలలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన చైర్మన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దుర్గాఘాట్ నుంచి అమ్మవారి సన్నిధికి, అమ్మవారి సన్నిధి నుంచి ఘాట్‌కు దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని భక్తులతో పేర్కొన్నారు.



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

నియోజకవర్గ అభివృద్ధిలో జగనన్న ముద్ర శాశ్వతం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముద్ర శాశ్వతమని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం 23, 25 వ డివిజన్లలో రూ.45.88 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజా రెడ్డి, బెల్లం దుర్గా, కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి ఎమ్మెల్యే విష్ణు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ప్రతి డివిజన్ ను పార్టీలకతీతంగా కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి వారోత్సవాలను నిర్వహించుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 23వ డివిజన్ సూర్యనారాయణ వీధి, వేమూరి వారి వీధి. 25వ డివిజన్ కుప్పా వారి వీధి, రామమందిరం రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విమర్శించే ప్రతిపక్షాలకు.. ప్రజల సమక్షంలో నిర్వహించుకుంటున్న ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలే సమాధానమని తెలిపారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం, వీఎంసీ అనేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. టీడీపీ హయాంలో నగరం ఎందుకు నిర్లక్ష్యానికి గురైందో..? అభివృద్ధి నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో..? గత పాలకులు సమాధానం చెప్పాలన్నారు. కానీ ఈ ప్రభుత్వం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. వారు కోరుకుంటున్న అభివృద్ధిని చేతల్లో చేసి చూపిస్తోందన్నారు. 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్, 23వ డివిజన్ ఇంఛార్జి ఆత్మకూరు సుబ్బారావు, నాయకులు ఒగ్గు విక్కీ, బంకా భాస్కర్, వెన్నం రత్నారావు, చల్లా సుధాకర్, కొల్లిపర శ్రీను, ఎ.అప్పారావు, అబ్దుల్ నజీర్, కోలంటి రవి, యక్కల మారుతి, చినబాబు, లక్ష్మణ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

హోంగార్డుల సమస్యల పరిష్కారానికే 'దర్బార్'



దర్బార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు (ఇన్‌సెట్) హాజరైన హోంగార్డులు

డీసీపీ మోకా సత్తిబాబు

విజయవాడ స్పోర్ట్స్: విధి నిర్వహణలో హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా 'దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అడ్మిన్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) మోకా సత్తిబాబు అన్నారు. కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు విజయవాడ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డీసీపీ సత్తిబాబు పాల్గొని మాట్లాడారు. హోంగార్డులు పోలీస్ శాఖలో భాగమేనన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినపుడు పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. బందోబస్తు, ఎస్కార్ట్ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేస్తూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. వృత్తిపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గత నెలలో నిర్వహించిన సంక్షేమ కమిటీ సమావేశంలో చర్చించిన పలు అంశాలపై హోంగార్డులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు హోంగార్డులు విన్నవించారు. హోంగార్డ్స్ కమాండెంట్ కె.వి.ప్రేమ్‌జిత్, హోం గార్డ్స్ డీఎస్పీ ఐ.మోహన్‌కుమార్, ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన ఉండాలి

పెనమలూరు: అవయవ దానంపై ప్రతి ఒక్కరూ అవాహన పెంచుకోవాలని ఆయుష్ ఆస్పత్రి ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ కేకేడీ సురేఖ అన్నారు. ఈ నెల 13వ తేదీన అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా కానూరు పీవీపీ సిద్ధార్థ కాలేజీలో బుధవారం జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవయవదానం చేయటం వలన ప్రాణాపాయస్థితిలో ఉన్న ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు.

● పోలీసుల రిహార్సల్స్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న కార్యక్రమానికి పోలీసులు బుధవారం రిహార్సల్స్ చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

స్టెల్లా ఆధ్వర్యంలో శాంతియాత్ర

పటమట(విజయవాడతూర్పు): ఆయుధాలు లేని ప్రపంచాన్ని భవిష్యత్ తరాలకు అందిచాలని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ జస్వింత క్వాడ్రస్ అన్నారు. నాగసాకి, హిరోషిమాపై అణు బాంబులు వేసి 78 ఏళ్లవుతున్న సందర్భంగా కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అణు బాంబు దాడులకు బలైన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా దేశాల్లో అంతర్గత ఉద్రిక్తతలు ప్రపంచ అశాంతికి ఆజ్యం పోశాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవి మానవ ఉనికిని ప్రశ్నిస్తున్నాయని పేర్కొన్నారు. నిరాయుధీకరణ అనేది సురక్షితమైనదన్నారు. విద్యార్థులు 'యుద్ధానికి నో చెప్పండి,' ప్రపంచానికి శాంతిని వ్యాప్తి చేయండి' అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ డాక్టర్ జి. లిటిల్ ఫ్లవర్, సీనియర్ అధ్యాపకురాలు పి.పద్మలత, ఇతర ఫిజిక్స్ విభాగం సభ్యులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అణగారిన వర్గాల మహిళలపై ఆగని హింస

దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో అణగారినవర్గాల మహిళలపై నిత్యం దాడులు, హింస జరుగుతూనే ఉన్నాయని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో ' స్వతంత్ర్య భారతంలో కులం, మతం, హింస అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల మహిళలపై జరుగుతున్న హింసకు మణిపూర్ ఘటనే తార్కాణమని చెప్పారు.

ఈ ఘటనలో సిగ్గుపడాల్సింది బాధిత మహిళలు కాదని, యావత్ భారత దేశం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. మహిళలపై హింసను అరికట్టాలని కోరారు. నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ అనిత మాట్లాడుతూ మణిపూర్ అంటేనే భయమేస్తోందని తెలిపారు. ఈ హింసకు ముగింపు లేదా? అని ప్రశ్నించారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా మహిళలపై జరిగే అఘాయిత్యాలు, దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. స్త్రీలకు రాజ్యాంగం హక్కులు కల్పించినా, ప్రత్యేక చట్టాలు ఉన్నా అవి అమలు కావడంలేదని ఆవేదన చెందారు. జీవించే హక్కు, స్వేచ్ఛ కలిగిన దేశంలో ఇటువంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షురాలు బి.శ్వేత, భూమిక సంస్థ ప్రతినిధి అనుపమ, సఫాయి కర్మచారి నాయకులు బి. శ్రీదేవి, దళిత స్త్రీ శక్తి కో ఆర్డినేటర్లు రోజా, మేరీనిర్మల, కుమారి, లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కావడి మహోత్సవం

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సేవా సమితి (తమిళ సంఘం) ఆధ్వర్యంలో విమాన కావడి మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుని భక్తులు నిర్వహించిన వివిధ రకాల పూజా కార్యక్రమాలు ఒళ్లు గగుర్పాటు కలిగించాయి. వీపునకు కొక్కేలను దించుకొని తాడుపై వేలాడుతూ నిర్వహించిన విమానకావడి భక్తులను తన్మయుల్ని చేసింది. వన్‌టౌన్‌లోని స్థానిక పాడివీధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామికి పూజలు నిర్వహించారు. ముగ్గురు యువకుల వీపు భాగానికి కొక్కేలను గుచ్చి, వారు గాలిలో వేలాడే విధంగా తాడుతో కడతారు. క్రేన్ సాయంతో భూమికి 20 అడుగుల ఎత్తులో 50 అడుగుల మధ్య ప్రయాణం చేస్తూ షణ్ముఖునికి పూజ నిర్వహించడమే విమానకావడిగా పేర్కొంటారు. ఈ విమానకావడిలో మూడు పర్యాయాలు భక్తులు వెనుకకు ముందుకు వెళ్లి వస్తారు. ఈ సందర్భంగా తొలిసారి దండ వేసి పూజ చేయడం, రెండోసారి కొబ్బరికాయ కొట్టి హారతి ఇవ్వడం, మూడో సారి నిమ్మకాయలను మంత్రించి భక్తులపైకి విసరడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు తమ వీపులకు ఇనుప కొక్కేలను తగిలించుకొని వాటితో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి విగ్రహాన్ని ఉంచిన ట్రాక్టర్‌ను లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో తమిళ భక్తులు పన్నీరుకావడి, పాలకావడి, పుష్పకావడి తదితర మొక్కులను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు పాడివీధిలో ప్రారంభమై తారాపేట రైల్వేస్టేషన్, కాళేశ్వరరావు మార్కెట్ బస్‌టెర్మినల్, గద్దబొమ్మ సెంటర్, కెనాల్‌రోడ్డు మీదుగా కష్టానదికి చేరుకుంది. అక్కడి నుంచి రథం సెంటర్, బ్రాహ్మణవీధి మీదుగా కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకొని భక్తులు మొక్కులు చెల్లించారు. సమితి నిర్వాహకులు కే.చిన్నిస్వామి మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాలుగా తమ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్వామి వారి అనుగ్రహంతోనే ఏటా విమాన కావడి మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌స్వామి తమిళ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విమాన కావడి నిర్వహిస్తున్న యువకులు



ప్రత్యేక అలంకరణలో స్వామి

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. అమర గాయకులు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, భానుమతి, పిఠాపురం నాగేశ్వరరావు తదితరులు గానం చేసిన గీతాలను కారుమంచి రాజు ఆధ్వర్యంలో ఆంజనేయ నాయక్, కృష్ణకుమారి, రూపాశ్రీ షబానా, వడ్డాది కామేశ్వరి, పి.శ్రీనివాసరావు ఆలపించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. వేదిక ద్వారా నూతన గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తునట్లు తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు జిలానీఖాన్, చింతకాయల చిట్టిబాబు సీనియర్ గాయకుడు బాలజీకుమార్, గెల్లి సువర్ణ, సత్యవర్ధన్ పాల్గొన్నారు. గాయకుడు అంజనేయ నాయక్‌కు యువగాన చక్రవర్తి బిరుదుతో సత్కరించారు.



అంజనేయ నాయక్‌ను సత్కరిస్తున్న రాజు, చిట్టిబాబు, నరసింహారావు తదితరులు